క్లుప్తంగా

డి.పట్టా భూములపై సర్వే చేయాలని వినతి


వినతిపత్రం సమర్పిస్తున్న గిరిజనులు

పోలవరం రూరల్ : వింజరం గ్రామపంచాయతీ సున్నాల గండి ప్రాంత సమీపంలో గిరిజనులకు ఇచ్చిన డి.పట్టా భూములపై రెవెన్యూ, అటవీ శాఖాధికారులు సంయుక్తంగా సర్వే నిర్వహించి తమ భూములను ఆన్‌లైన్‌లో రికార్డు చేయాలని కోరుతూ పోలవరం అటవీశాఖ రేంజ్ అధికారి ఎన్.దావీదు రాజుకు గిరిజనులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2010వ సంవత్సరంలో ఐదవ విడతగా 30 మందికి డి.పట్టాలు మంజూరు చేయగా 8 మందికి సంబంధించి భూములు ఆన్‌లైన్ చేశారని, మిగిలిన 22మందికి చెందిన భూములు ఆన్‌లైన్ కాలేదన్నారు. అధికారులు సర్వే చేసి తమకు న్యాయం చేయాలని కోరుతూ ఐటీడీఏస్ డైరెక్టర్ జి.అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో గిరిజనులు వినతిపత్రం సమర్పించారు.

మహిళా పోలీసులతో సమీక్ష

జంగారెడ్డిగూడెం: గ్రామాల్లోని శాంతి భద్రతలు, తదితర అంశాలపై మంగళవారం ఎస్సై ఎం.సాగర్‌బాబు మహిళా పోలీసులతో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన ఈ సమావేశంలో గ్రామాల్లో ఉన్న పరిస్థితులపై మహిళా పోలీసులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణ ప్రాథమిక కర్తవ్యంగా మహిళా పోలీసులు విధులు నిర్వహించాలన్నారు

18న ప్రత్యేక లోక్ అదాలత్

చింతలపూడి : స్థానిక కోర్టులో ఈనెల 18న ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు చింతలపూడి పూర్తి అదనపు జూనియర్ సివిల్ జడ్జి పి.పరేష్ కుమార్ మంగళవారం తెలిపారు. లోక్ అదాలత్‌లో కుటుంబ తగాదా కేసులు, గృహహింస కేసులు రాజీ చేసుకోవచ్చునన్నారు. ప్రతి శుక్రవారం కోర్టులో ప్రీ లోక్ అదాలత్ సిట్టింగ్స్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రాజీ పడదగ్గ కేసులు లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలని సూచించారు. కక్షిదారులు లోక్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కృత్రిమ అవయవాలపై అవగాహన

బుట్టాయగూడెం : రెడ్డిగణపవరం అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం ఫిజియోథెరపిస్ట్ జి.రాంబాబు ఆధ్వర్యంలో కృత్రిమ అవయవాల పట్ల, వైకల్య నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీడీఆర్‌సీ సంస్థ అందిస్తున్న సేవలను వినియోగించుకోవాలని ఉమా ఎడ్యుకేషనల్, టెక్నాలజీ సొసైటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పెద్దిరెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త నిర్మల, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ జయవాణి తదితరులు పాల్గొన్నారు.

అప్రైజర్ చేతివాటంపై విచారణకు ఆదేశం

జంగారెడ్డిగూడెం : స్థానిక బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్‌లో అప్రైజర్ ఎం.రామశేషాచార్యులు చేతివాటంపై ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. దీనిపై బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏజీఎం తేజేశ్వరరావు సాక్షితో ఫోన్‌లో మాట్లాడుతూ జంగారెడ్డిగూడెం బీవోఐ బ్రాంచ్‌లో జరిగిన అవకతవకలపై ముంబై కేంద్ర కార్యాలయానికి నివేదిక అందజేశామన్నారు. దీనిపై విచారణకు ముంబై నుంచి ఒక బృందం రానున్నట్లు తెలిపారు. ఇదిలా ఉంటే అప్రైజర్ ఎం.రామశేషాచార్యులు సుమారు రూ.10 లక్షలు బ్యాంకుకు చెల్లించినట్లు తెలిసింది.

లేఅవుట్ పరిశీలన

టి.నరసాపురం : బొర్రంపాలెం లేఅవుట్ వద్ద యంత్రాల సహాయంతో పునాదులు తీయించి ఇళ్ల నిర్మాణాలు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని గృహ నిర్మాణ శాఖ పీడీ వేణుగోపాల్ చెప్పారు. జగనన్న లేఅవుట్ కాలనీ ప్రదేశాన్ని ఆయన మంగళవారం పరిశీలించారు. లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలకు ముందుకు రావాలని, సమస్యలను వెంటనే పరిష్కరిస్తామన్నారు. తహసీల్దార్ సుబ్బారావు, ఎంపీడీవో ఎస్‌టీ స్వామి, ఏఈ రాధాకృష్ణ ఉన్నారు.

విజ్ఞానశాస్త్రంపై ఆసక్తి పెంపొందించుకోవాలి

ద్వారకాతిరుమల : విద్యార్థులు విజ్ఞానశాస్త్రంపై ఆశక్తిని పెంపొందించుకోవాలని శ్రీవారి దేవస్థానం సంస్కృతోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పీవీఏఎంఎస్ కుమార్ అన్నారు. జాతీయ సైన్స్ డేను పురస్కరించుకుని స్థానిక పాఠశాలలో సీవీ రామన్ చిత్రపటానికి హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం హెచ్‌ఎం మాట్లాడుతూ భారత దేశంలో సైన్స్ అభివృద్ధికి సీవీ రామన్, ఐన్‌స్టీన్, ఏపీజే అబ్దుల్ కలాం తదితరులు పాటుబడ్డారని, ఈ తరం విద్యార్థులు వారిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. తమ పాఠశాల విద్యార్థులు విజ్ఞాన శాస్త్రంలో ఇప్పటి వరకు నాలుగు పర్యాయాలు రాష్ట్రస్థాయి అవార్డులు పొందారన్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు ప్రయోగాలకు సంబంధించిన ప్రాజెక్టులను ప్రదర్శించారు. వారికి హెచ్‌ఎం బహుమతులను అందజేశారు.

చింతలపూడి : జాతీయ సైన్స్ దినోత్సవాన్ని మంగళవారం పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఘనంగా జరుపుకున్నారు. సర్ సీవీ రామన్ చిత్ర పటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక ప్రభుత్వ హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమానికి ఎంపీపీ డా బి.రాంబాబు నాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మూఢనమ్మకాలను విడనాడి, శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులు రూపొందించిన విజ్ఞాన ప్రదర్శనను తిలకించారు. జిల్లా పరిషత్ హైస్కూల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు.


ద్వారకాతిరుమలలో ప్రాజెక్టులను ప్రదర్శిస్తున్న విద్యార్థులు


చింతలపూడిలో ప్రదర్శనను తిలకిస్తున్న ఎంపీపీ రాంబాబు నాయక్


రావికంపాడులో సీవీ రామన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం : జాతీయ సైన్స్ దినోత్సవం పురస్కరించుకుని గవరవరం వెంకటపతి రాజు హైస్కూల్లో మంగళవారం డ్రాయింగ్, క్విజ్ వక్తృత్వపు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఉస్మానియా యూనివర్సిటీలో సాయిల్స్ డిపార్ట్‌మెంట్ సైంటిస్ట్ డాక్టర్ రాజాజీ విద్యార్థులకు సైన్స్ ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. మాజీ జెడ్పీటీసీ ఎస్ఆర్ఆర్‌పీ సుభద్ర దేవి, సెక్రటరీ అండ్ కస్పాండెంట్ ఎస్ఆర్ఆర్ నరసింహారాజు, ప్రిన్సిపాల్ అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కామవరపుకోట : రావికంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. సర్ సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు సైన్స్ ప్రాజెక్టులు ప్రదర్శించారు. ప్రధానోపాధ్యాయులు ఉమ్మడి భీమరాజు మాట్లాడుతూ సైన్స్‌ను అవగాహన చేసుకుని విద్యార్థులు భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. స్థానిక ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో సైన్స్ దినోత్సవం నిర్వహించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రవీంద్ర బాబు మాట్లాడుతూ భౌతిక శాస్త్రంలో విజ్ఞాన శాస్త్ర ఆవిష్కరణకు నాంది పలికిన గొప్ప శాస్త్రవేత్త సర్ సీవీ రామన్ అని అన్నారు.

టి.నరసాపురం : బొర్రంపాలెం హైస్కూల్‌లో జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. జెడ్పీటీసీ సామంతపూడి బాలసూర్యనారాయణరాజు ఉత్తమ ప్రదర్శనలకు బహుమతులను అందజేశారు. విద్యార్థులకు క్విజ్, వక్తృత్వం, వ్యాసరచన పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులు అందించారు.

పోలవరం రూరల్ : భారతదేశ కీర్తిని ప్రపంచానికి చాటిన వ్యక్తి సీవీ రామన్ అని గూటాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాఘవన్ అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

భారత విజ్ఞాన శిఖరం సర్ సీవీ రామన్

జంగారెడ్డిగూడెం : భారత విజ్ఞాన శిఖరం సర్ సీవీ రామన్ అని జంగారెడ్డిగూడెం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్ సీహెచ్ సుధాకర్ రెడ్డి అన్నారు. జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం జాతీయ సైన్స్ డే ఘనంగా నిర్వహించారు. విద్యార్థులచే తయారు చేయబడ్డ సైన్స్ నమూనాలను ఆయన పరిశీలించారు. పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ పచ్చిపాల మృత్యుంజయరాజు, సైన్స్ ఉపాధ్యాయులు సీహెచ్ జ్యోతి బాబు తదితరులు పాల్గొన్నారు. సీఎస్‌టీస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ ప్రసాద్ బాబు అధ్యక్షత వహించారు.

సీఎం జగన్‌పై ప్రజలకు నమ్మకం ఉంది

కొయ్యలగూడెం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ప్రజలకు, ప్రజలపై జగనన్నకు నమ్మకం ఉంది కాబట్టే రాష్ట్రంలోని మొత్తం 175 అసెంబ్లీ స్థానాలలో వైఎస్సార్‌సీపీ పోటీ చేస్తోందని ఎంపీపీ గంజిమాల రామారావు పేర్కొన్నారు. మంగళవారం గ్రామంలో రైతు భరోసా ద్వారా లబ్ధి పొందిన నేపథ్యంలో రైతులు ప్రభుత్వానికి కృతజ్ఞతా పూర్వక సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రామారావు మాట్లాడుతూ ప్రతిపక్ష పార్టీలకు ప్రజలపై నమ్మకం లేదు కాబట్టే దత్తుడ్ని వెంటబెట్టుకొని పొత్తులతో పోటీ చేయాలని చూస్తున్నారని ఎద్దేవా చేశారు. నాలుగేళ్ల సీఎం వైఎస్ జగన్ పాలనలో రాష్ట్రంలో ఎక్కడా కరువు కాటకాలు లేవని, ఏడాదిలో మూడు కాలాలు కూడా రైతులు పడ్డ కష్టానికి ప్రతిఫలాన్ని అందించాయన్నారు. బాబు వస్తే కరువే అని ప్రజలు ఈసడించుకుంటున్నా పచ్చ మీడియాని అడ్డం పెట్టుకొని ఎన్నికలకు సిద్ధమవుతున్నారన్నారు.


రైతు సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

రాబోయే సార్వత్రిక ఎన్నికల అనంతరం టీడీపీకి ప్రజలు ఫేరీ కడతారని, దత్తుడ్ని మళ్లీ సినిమాలకే పరిమితం చేస్తారన్నారు. పోలవరం నియోజకవర్గ వ్యాప్తంగా రైతు భరోసా ద్వారా 2,996 మంది రైతులకు ఒక కోటి 11 లక్షల 26 వేల రూపాయల లబ్ధి చేకూరిందన్నారు. సున్నం వెంకటేశ్వరరావు, నారా రామకృష్ణ, దూలపల్లి కాంతారావు, చిడిపి వెంకటరావు, చిడిపి నాగరాజు పాల్గొన్నారు.

ప్రతి కేసునూ సత్వరమే పరిష్కరించాలి

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం పోలీస్ సబ్‌డివిజన్ డివిజన్ పరిధిలో నమోదైన ప్రతి కేసును సత్వరమే పరిష్కరించేలా సీఐలు, ఎస్సైలు పనిచేయాలని డీఎస్పీ కేవీ సత్యనారాయణ అన్నారు. మంగళవారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో నేర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ స్టేషన్‌లో నమోదైన కేసులు ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషిచేయాలన్నారు. పెండింగ్ కేసులు అనే మాటకు తావు ఇవ్వొద్దన్నారు. ముఖ్యంగా డివిజన్ పరిధిలో కోడిపందాలు, జూదక్రీడలు, మత్తు పదార్థాలు సేవించడం, అమ్మడం, రవాణా తదితర వాటిపై ఉక్కుపాదం మోపాలన్నారు. మద్యం అక్రమ రవాణాపై కఠినంగా వ్యవహరించాలని సూచించారు. అనుమానితుల, రౌడీషీటర్ల, వివిధ నేరాల్లో కేసులు నమోదైన


సీఐలు, ఎస్సైలతో సమీక్షిస్తున్న డీఎస్పీ సత్యనారాయణ

వారిని గుర్తించి వారికి తరచుగా కౌన్సిలింగ్ ఇస్తూ నేరాల వైపు వెళ్లకుండా చూడాలన్నారు. రోడ్డు భద్రతా నియమాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి, జంగారెడ్డిగూడెం సీఐలు ఎంవీఎస్ మల్లేశ్వరరావు, పి.బాలసురేష్‌బాబు, ఎస్సైలు పాల్గొన్నారు.

దేవతామూర్తుల గ్రామోత్సవం

కొయ్యలగూడెం : శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ మదన గోపాలస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్టాపనోత్సవాలు బుధవారం నుంచి నిర్వహించనున్నారు. నూతనంగా నిర్మించిన ఆలయంలో ప్రధాన మూల విరాట్ శ్రీ మదన గోపాల స్వామిని ప్రతిష్ఠించనుండగా ఇరువైపులా నిర్మించిన నూతన ఉపాలయాలలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి, శ్రీ వెంకటేశ్వర స్వామి విగ్రహాలను భక్తులతో శాస్త్రోక్తంగా ప్రతిష్టచేయనున్నారు. వీటితో పాటుగా శ్రీ అభయాంజనేయ స్వామి, శ్రీ విశ్వక్సేన, శ్రీ గరుడ విగ్రహాలను, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఏక సమయంలో ప్రారంభం కానున్నాయి. మధ్యాహ్నం 20వేల మంది భక్తులకు మహా అన్నసమారాధన నిర్వహించనున్నారు. ప్రాణ ప్రతిష్ట నేపథ్యంలో మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. శిలా విగ్రహాలకు క్షీరాధివాసం జలాధివాస పూజలు చేశారు. ఈ సందర్భంగా దేవతామూర్తుల విగ్రహాలను గ్రామోత్సవం నిర్వహించారు.

వాహనాల తనిఖీ

బుట్టాయగూడెం : వాహనదారులు తప్పనిసరిగా పత్రాలను అందుబాటులో ఉంచుకోవాలని ఎస్సై ఎం.జయబాబు అన్నారు. మంగళవారం బీసీ కాలనీ వద్ద వాహనాలను తనిఖీ చేశారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణకు సహకరించండి

చింతలపూడి : స్థానిక అగ్నిమాపక కార్యాలయాన్ని మంగళవారం జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి డి మాల్యాద్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. పట్టణంలోని రత్నాపింగ్ మాల్ భవనాన్ని, వీకేఎం ఫంక్షన్ హాల్‌ను పరిశీలించి భద్రతా నియమాలు పాటించడం లేదని గుర్తించి అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేసవి కాలం ప్రారంభమైందని గృహ యజమానులు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అగ్ని ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు. అపార్ట్‌మెంట్లు, షాపింగ్ మాల్స్ నిర్మాణంలో భద్రతా నియమాలు పాటించాలని చెప్పారు.

పీహెచ్‌సీ వైద్యురాలు రామలక్ష్మి మృతి

బుట్టాయగూడెం : పులిరామన్నగూడెం పీహెచ్‌సీలో పనిచేస్తున్న వైద్యురాలు టి.రామలక్ష్మి(40) రాజమండ్రిలోని ఒక ఆస్పత్రిలో వైద్యం పొందుతూ మంగళవారం మృతి చెందారు. పీఆర్‌గూడెం వైద్యులు జె. సురేష్ తెలిపిన వివరాల ప్రకారం రామలక్ష్మి ప్రసవం కోసం రాజమండ్రిలోని ఒక ఆస్పత్రిలో చేరి మగబిడ్డకు జన్మనిచ్చారని, ప్రసూతి అనంతరం వచ్చిన సమస్యతో పరిస్థితి విషమించి మరణించినట్లు తెలిపారు. బుట్టాయగూడెం మండలం తాడితోటలోని గిరిజన కుటుంబానికి చెందిన రామలక్ష్మి తన తాతయ్య తోడం పెంటయ్య వద్ద ఉంటూ ఎంబీబీఎస్ పూర్తిచేశారు. పీఆర్ గూడెం పీహెచ్‌సీలో వైద్యాధికారిణిగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టి సేవలందిస్తున్నారు. ఏడాదిన్నర క్రితమే తూర్పుగోదావరి జిల్లా వెంకటరెడ్డిగూడెం గ్రామానికి చెందిన కె.కమలాకర్‌తో ఆమెకు వివాహమైంది.


రామలక్ష్మి(ఫైల్)

వ్యవసాయ విద్యుత్ వేళల్లో మార్పులు

కొయ్యలగూడెం : వ్యవసాయ విద్యుత్ సరఫరా సమయాల్లో మార్పులు చేసినట్లు ఏపీఈపీడీసీఎల్ కొయ్యలగూడెం ఏఈ రామారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు గ్రూప్-ఏలో ఉన్న వ్యవసాయ సర్వీసులకు ఉదయం 5 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండేదని, మార్పు అనంతరం ఏ-కేటగిరి వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు రెండు విడతలుగా అనగా తెల్లవారుజాము 3 నుంచి ఉదయం 6 గంటల వరకు, ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరా ఉంటుందన్నారు. అలాగే బి-కేటగిరికి సంబంధించి గతంలో ఉదయం 8 నుంచి 5 గంటల వరకు విద్యుత్ అందిస్తుండగా, అదే వేళలను కొనసాగిస్తున్నట్లు ఆయన తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

ద్వారకాతిరుమల : మండలంలోని రామన్నగూడెంలో ఒక పేకాట స్థావరంపై మంగళవారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో 6 గురు జూదరులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ. 2,120 నగదు, 5 బైక్‌లను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్టు ఎస్సై టి.సుధీర్ తెలిపారు.

వ్యక్తికి గాయాలు

టి.నరసాపురం : వల్లంపట్ల సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం టి.నరసాపురం వైపు నుంచి ద్విచక్ర వాహనంపై వస్తున్న వ్యక్తిని ఎదురుగా వెళుతున్న కారు ఢీకొనడంతో ద్విచక్ర వాహనదారుడికి గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని స్థానికులు జంగారెడ్డిగూడెం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

మరుగుదొడ్ల నిర్మాణానికి స్థల పరిశీలన

పోలవరం రూరల్ : పోలవరం బస్‌షెల్టర్ సమీపంలో మరుగుదొడ్ల నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని ఎంపీడీవో సీహెచ్ శ్రీనివాసబాబు పరిశీలించారు. వీటినిర్మాణానికి సంబంధించి అంచనాలు సిద్ధం చేయాలని ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లను ఆదేశించారు. బస్ షెల్టర్ వద్ద ప్రయాణీకులు కనీస మరుగుదొడ్ల సౌకర్యం లేక నానా అవస్థలు పడుతున్నారు. ఈ విషయాన్ని గ్రామస్తులు స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో మండల పరిషత్‌నిధుల నుంచి మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టేందుకు ఏర్పాట్లు చేపట్టారు.

గుండెపోటుతో డాక్టర్ రెడ్డి మృతి



జంగారెడ్డిగూడెం : పట్టణంలోని మొట్టమొదటి సర్జన్ వైద్యులు డాక్టర్ జంగా బాబు రాజేంద్ర ప్రసాద్ రెడ్డి (87) మంగళవారం మధ్యాహ్నం విజయవాడ ప్రైవేట్ ఆస్పత్రిలో గుండె పోటుతో మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. పెద్ద కుమారుడు ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందారు. పట్టణంలోని జూనియర్, డిగ్రీ కాలేజీల అభివృద్ధికి, సబ్‌స్టేషన్, బస్టాండ్ నిర్మాణాలకు కృషిచేసిన మహనీయుడని పలువురు కొనియాడారు. డాక్టర్ రెడ్డి మృతికి సంతాప సూచికంగా బుధవారం పట్టణంలోని అన్ని ప్రైవేట్ ఆసుపత్రులు బంద్ పాటిస్తున్నట్లు ఐఎంఏ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ కె.వజ్ర కిరణ్, కె.రామచంద్రబాబు తెలిపారు. కేవలం అత్యవసర సేవలను మాత్రమే అందజేస్తామన్నారు.

ఘనంగా దర్జీల దినోత్సవం

కొయ్యలగూడెం : ప్రభుత్వం కల్పిస్తున్న చేయూత పథకం ద్వారా దర్జీలు దర్జాగా జీవిస్తున్నారని కొయ్యలగూడెం మేజర్ పంచాయతీ సర్పంచ్ ముప్పిడి విజయ కుమారి పేర్కొన్నారు. టైలర్స్ డే దినోత్సవాన్ని మంగళవారం గణేష్ సెంటర్లో నిర్వహించారు. నూతనంగా ఏర్పాటైన విలియం హో గణపతి రామా టైలర్స్ అసోసియేషన్ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. టైలర్స్ అసోసియేషన్ భవనానికి పంచాయతీ తరపున నాలుగు సెంట్ల స్థలాన్ని కేటాయించడంతో పాటు ప్రభుత్వ సహాయంతో నూతన భవనాన్ని నిర్మిస్తామని ఆమె హామీ ఇచ్చారు.

చింతలపూడి : ఏడాదికి రూ.10 వేలు సహాయం చేస్తూ టైలర్ల కుటుంబాలను ఆదుకుంటున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదరణను మర్చిపోలేమని ఆదర్శ టైలర్ల సంక్షేమ సంఘం నాయకులు అన్నారు. టైలర్స్ డే సందర్భంగా మంగళవారం చింతలపూడి పట్టణంలో టైలర్లు ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంచిపెట్టారు.


కొయ్యలగూడెంలో కేక్ కట్ చేస్తున్న సర్పంచ్ విజయకుమారి, టైలర్లు


కామవరపుకోటలో మహిళా టైలర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: శ్రీవెంకటేశ్వర నవ్యాంధ్ర టైలర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టైలర్స్ డే నిర్వహించారు.

కుక్కునూరు : టైలర్స్ అసోషియేషన్ మండల అధ్యక్షుడు ఎంఎస్ ఆనంద్ ఆధ్వర్యంలో టైలర్ల దినోత్సవం నిర్వహించారు.

పోలవరం రూరల్ : శ్రీసాయి టైలర్స్ సొసైటీ అధ్యక్షుడు గానాల బాబ్జి రామచంద్రరావు ఆధ్వర్యంలో టైలర్స్ డే నిర్వహించారు.

కామవరపుకోట : శ్రీ వీరభద్ర టైలర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టైలర్స్ డే నిర్వహించారు. స్థానిక తపన ఫౌండేషన్ కుట్టు శిక్షణ శిబిరంలో మహిళలకు కుట్టు శిక్షణ ఇచ్చిన టైలర్ బలుసు లక్ష్మీని సత్కరించారు.

ద్వారకాతిరుమల: వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, నాయకులు బొండాడ వెంకన్నబాబు, జంగా వెంకట కృష్ణారెడ్డి, టైలర్స్ సంఘ సభ్యులు కుట్టుమిషన్ సృష్టికర్త విలియమ్స్ హో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.